దుమ్ములేచిపోతోంది..


ఖమ్మం- ఇల్లెందు రోడ్డులో బస్సు వెనుక లేస్తున్న దుమ్ము

ఖమ్మం-ఇల్లెందు రోడ్డులో ప్రయాణం నరకం

- రోడ్డు విస్తరణ పనులతో వాహనదారుల అవస్థలు
- దుమ్ము, ధూళితో రోడ్డు కనిపించక ప్రమాదాలు
- రూ.35 కోట్లతో సా..గుతున్న పనులు
- చోద్యం చూస్తున్న అధికారులు

రఘునాథపాలెం: ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రోడ్డు మార్గంలో రఘునాథపాలెం నుంచి బూడిదంపాడు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాలు ప్రయాణించే సమయాన దుమ్ము లేస్తుండడంతో ప్రయాణం ప్రయాసగా మారింది. రాకపోకలు సాగించేందుకు మరో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ఇదే మార్గాన ప్రయాణిస్తున్న ప్రయాణికులు దుబ్బ దెబ్బకు గత కొన్ని నెలలుగా నరకయాతన అనుభవిస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు దుమ్ము, ధూళితో వాహనాలు కనిపించక పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈరోడ్డుపై ప్రయాణమంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.35 కోట్లతో..

రఘునాథపాలెం–జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద గల రైతు వేదిక నుంచి బూడిదంపాడు పవర్ గ్రిడ్ వరకు రూ.35 కోట్లతో సుమారు 8 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. నాలుగు వరుసల రహదారితో పాటు డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఐదు నెలల క్రితం పనులు ప్రారంభం కాగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగించడంతో పాటు గతంలో ఉన్న రహదారిని, వంతెనలను తొలగించి ఇరువైపులా విస్తరణ పనులు చేపట్టారు. రహదారిపై అక్కడక్కడ కల్వర్టుల నిర్మాణం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దుమ్ము లేవకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం నాలుగు ట్యాంకర్ల నీళ్లతో రోడ్డును తడిపిస్తున్నాం. వాహనదారులు తారు వేయని కొత్తరోడ్డులో రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ములేస్తోంది. అయినా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా వీలైనంతా చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రవీణ్, ఆర్అండ్‌బీ ఏఈ

ప్రయాణ పాట్లు..

ఇల్లెందు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో దుమ్ము, ధూళి లేచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ముందు వాహనం వెళ్లిందంటే వెనక వెళ్లే వాహనాలకు దారి కనిపించని పరిస్థితి ఉంది. దీంతో రోజు పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ప్రమాదానికి గురవుతున్నాయి. అక్కడక్కడ నీళ్లు చల్లుతున్నారే తప్ప పూర్తిస్థాయిలో నీళ్లు చల్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేసి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.


రోడ్డును కమ్మేసిన దుమ్ము

క్లుప్తంగా

రేపు ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 16వ తేదీన పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన పదో తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి ప్రతిభా పరీక్ష జిల్లా సైన్స్ మ్యూజియంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారని, ఈ పరీక్షను డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించనుండగా మొత్తం 63 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు చెప్పారు.

స్థల దాతకు సన్మానం


మదార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండల కేంద్రంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాత దేవాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కామేపల్లికి చెందిన ఇరబోయిన మదార్ వితరణగా అందించారు. ఈమేరకు శుక్రవారం స్థల దాతను గ్రామస్తులు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాగం రంగారావు, జర్పుల రామారావు, అజ్మీరా రాందాస్, హరి, చిన్నా, భూక్యా శ్రీను, సీతారాం, అజ్మీరా లక్ష్మణ్, బన్సీ, గుగులోత్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నేలకొండపల్లి: వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నేలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం 50కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌ాధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూసుమంచి విద్యుత్ శాఖ ఏడీ కోక్యా నాయక్ మాట్లాడుతూ.. లో ఓల్టేజ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఏఈ కె.రామారావు, ఎల్ఐ సత్యనారాయణరెడ్డి, సబ్ ఇంజనీర్ అబ్దుల్ ఖదీర్, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో విద్యార్థినులు

కూసుమంచి: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన బాలికా సంరక్షణపై అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ సమ్రీన్ బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వంటి విషయాలను వివరించారు. బాలికలు చదవును కొనసాగించాలని, చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం తామంతా తప్పనిసరిగా చదువుకుంటామని విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ అజితకుమారి, చైల్డ్ వెల్ఫేర్ అధికారి నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	లైలా
ఆదిత్య	బ్రహ్మా ఆనందం
శ్రీనివాస	కెప్టెన్ అమెరికా

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	24		20
బెండకాయ	44	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	38	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	24		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	44		20
గోరుచిక్కుడు	44	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		40
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	24		25
క్యాప్సికం	54	-ఖమ్మం వ్యవసాయం	

కేంద్రం ‘ఉపాధి’కి నిధులు పెంచాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

రఘునాథపాలెం: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మంచుకొండలో జరిగిన వ్యవసాయ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి కేవలం రూ.86 వేల కోట్ల కేటాయించి కూలీలకు పనిలేకుండా చేసిందని, బడ్జెట్‌లో రూ.3లక్షల కోట్లు కేటాయించి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రతి నెలా రూ.2,500, ఎలాంటి నిబంధనలు లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, పెన్షన్లను రూ.2వేల నుంచి రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, తాపీమేస్త్రీలు షేక్ నస్రిన్, బి.నాన్‌కు, జైరాబీ, భద్రమ్మ, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం

ఖమ్మంరూరల్: ఎన్నికల సమయాన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని న్యూడెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటినా హామీలు అమలు చేయకుండా సర్వేల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, రేషన్‌కార్డులు ఇవ్వాలని, అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలేదని తెలిపారు. నాయకులు మహంకాళి ఉప్పలయ్య, తోట చిన్నఅప్పారావు, పుచ్చకాయల మంగయ్య, ఎం.మల్లయ్య పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి హేయం

ఖమ్మంలీగల్: రంగారెడ్డి జిల్లా కోర్టులో జీవిత ఖైదు పడిన నేరస్తుడు.. న్యాయమూర్తి పట్ల దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడిని తాము ఖండిస్తున్నామని, ఇది న్యాయవ్యవస్థపైనే జరిగిన దాడిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బార్ ఉపాధ్యక్షుడు కె.ఆర్.ఉపేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కె.వెంకటేశ్వరరావుతో పాటు అలవల యుగంధర్‌రావు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గం ఎమ్మెల్సీగా టీపీయూఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణ కోరారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రుద్రగాని మాధవ్, మహేంద్ర సింగ్, నక్క రవి, దొడ్డపనేని అప్పారావు, జ్యోతుల యుగంధర్, కృష్ణ చారి, కార్తీక్, శ్రీనివాస్, సతీష్, రవీందర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సుష్మాస్వరాజ్ జయంతి

నేలకొండపల్లి: పద్మ విభూషణ్, కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె సేవలను గుర్తుచేసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్,నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, గోపి, సాయి, నాగరాజు, కొండలరావు, మూడు రమేష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలి

కామేపల్లి: గొల్లగట్టు లింగమంతుల జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి, రెండు రోజులు ప్రభుత్వ సెలవు దినాలను ప్రకటించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పండితాపురంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేకల మల్లిఖార్జున్‌రావు, జాల శ్రీను, జక్కుల బ్రహ్మయ్య, సత్తి చిట్టిబాబు, కేతనబోయిన రాంబాబు, చిన్నబోయిన సత్యం, కృష్ణ, అల్లిక బక్కయ్య, సత్తి వీరబాబు, మల్లాది వెంకన్న, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ర్యాంపులు ఏర్పాటు చేయాలని నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని షాపింగ్ మాల్స్, పెద్దపెద్ద దుకాణాల ఎదుట మెట్లతో పాటు పక్కన దివ్యాంగులు వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు నిర్మించాలని యజమానులకు కేఎంసీ సిబ్బంది నోటీసులు జారీ చేస్తున్నారు. శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుందర ఆధ్వర్యాన నోటీసులు అందజేస్తున్నారు. 1:12 నిష్పత్తిలో ప్రతి షాపింగ్‌మాల్ ఎదుట ర్యాంపు నిర్మించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇక రోడ్డుపైకి వచ్చిన ర్యాంపులు, మెట్లను తొలగించాలని సూచిస్తున్నారు. ఇక దీనిపై ప్రత్యేకంగా నాలుగు టీంలను అధికారులు ఏర్పాటు చేశారు.


షాపింగ్‌మాల్ యజమానికి నోటీసు ఇస్తున్న సిబ్బంది

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మేయర్


ధ్వజస్తంభం వద్ద మేయర్ నీరజ, తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామిని ఖమ్మం మేయర్ పి.నీరజ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశాక నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. ఆమె వెంట పి.రామబ్రహ్మంతో పాటు వివిధ సంస్థల బాధ్యులు అశోక్‌రెడ్డి, జీవీఎస్.నాయుడు, మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా సబ్ స్టేషన్‌లోని 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ ప్రభాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నాయుడుపేట, సాయిప్రభాత్‌నగర్, టీచర్స్ కాలనీ, బీబీఎం స్కూల్, ఆర్ఎస్‌నగర్, చైతన్యనగర్‌లలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజేశ్వరపురంలో సీసీ కెమెరాలు


సీసీ కెమెరాల పాయింట్లను పరిశీలిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం పంచాయతీలో సీసీ కెమెరాలను ఏర్పాటుకు రాజేశ్వరపురం సొసైటీ మాజీ చైర్మన్ దండా ప్రవీణ్ ముందుకొచ్చారు. గ్రామస్తులు, పోలీసుల సూచనల మేరకు శుక్రవారం మాజీ సర్పంచ్ యర్రబోయిన నర్సయ్య ఆధ్వర్యాన గ్రామంలో ఎనిమిది కెమెరాల ఏర్పాటు పాయింట్లను గుర్తించగా.. ఖర్చు మొత్తం తాను భరిస్తానని ప్రవీణ చెప్పడంతో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చిట్యాల రమేష్, ఇస్లావత్ బాలాజీ, యం.సుధీర్, దూదిపాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

వైరా చోరీపై పోలీసుల ఆరా..

నేలకొండపల్లి: వైరాలో సర్వే పేరుతో పట్టపగలే ఇంట్లో చొరబడి ఓ వృద్ధురాలిని కట్టేసి చోరీ చేసిన ఘటనకు సంబంధించి వైరా పోలీసులు మండలంలో ఆరా తీశారు. శుక్రవారం వైరా పోలీసులు మండలంలోని రాయగూడెం గ్రామంలో సీసీ ఫుటేజీని పరిశీలించారు. వైరాలో చోరీ చేసి మండలంలోని రాయగూడెం మీదుగా కోదాడ వైపు వెళ్లి ఉంటారనే కోణంలో ఆరా తీస్తున్నట్లు సమాచారం.

కేఎంసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఆరా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ పి.శ్రీజ పలు విభాగాలను సందర్శించి, సిబ్బంది విధులపై ఆరా తీశారు. కార్యాలయంలో ద్వారం వద్ద ఉన్న ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ వద్దకు వెళ్లి ప్రజలు ఎలాంటి సలహాల కోసం వస్తున్నారని, వాటిని ఎలా నివృత్తి చేస్తున్నారన్న విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ సమస్యలపై రోజుకు ఎంత మంది వస్తున్నారని ఆరా తీశారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగం వైపు ఉన్న గదులను పరిశీలించి సిబ్బందికి గదుల కేటాయింపుల గురించి తెలుసుకున్నారు. వాల్ ప్రాజెక్ట్‌లో భాగంగా పెయింటర్లు కార్యాలయానికి రాగా..వారితో మాట్లాడిఅభినందించారు. అనంతరం ఏసీపీ వసుందర, ఆర్ఓ జి.శ్రీనివాసరావు, ఉద్యానఅధికారి రాధికలతో సమావేశమయ్యారు.


ఉద్యోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మహాధర్నాను జయప్రదం చేయండి


కామేపల్లి: మిర్చి కల్లాల వద్ద ప్రచారంలో నాయకులు

తిరుమలాయపాలెం/కామేపల్లి: మిర్చి క్వింటాకు రూ.25 వేలు ధర నిర్ణయించి ప్రభుత్వాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద చేపట్టిన రైతుల మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షుడు దుగ్గి కృష్ణ పిలిపునిచ్చారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండలకేంద్రంలో రమేష్, కామేపల్లి మండలంలోని లాల్యతండా, మద్దులపల్లి, హరిశ్చంద్రాపురం, కామేపల్లి, ఊట్కూర్, పింజరమడుగు, తాళ్లగూడెం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసిన సందర్భంగా రాంబాబు, కృష్ణలు మాట్లాడారు. మిర్చి ధర పూర్తిస్థాయిలో పతనం కావడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ఇప్పటికే పలువురు రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. జిల్లాలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతుల సమస్యలపై నిర్వహించే మహాధర్నాకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడు తుళ్లూరు నాగేశ్వరావు, నాయకులు గుండా సత్యనారాయణ, వజ్జా రామారావు, అంబటి శ్రీనివాసరెడ్డి, సకినాల శ్రీనివాసరావు, గుండా వెంకటరెడ్డి, ఆదపా రామనాథం, లావుడ్యా రామా, మంగీలాల్, రవి, బింగి రమేష్, పద్మనాభుల సుధాకర్, స్వామి, వెంకటరెడ్డి, కొమ్ము శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు’

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల రిజర్వేషన్‌లో బీసీల సంఖ్యను తగ్గించి, తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేశారని, భవిష్యత్‌లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షుడు పార నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో 22 శాతం ఉన్న మున్నూరుకాపు కుల జనాభాను మూడున్నర శాతం తక్కువగా చూపించడాన్ని తప్పుబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 28లక్షలుగా ఉన్న బీసీలు ప్రస్తుత ప్రభుత్వంలో 13 లక్షలు ఉండడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయా జిల్లా కలెక్టరేట్‌లలో ఈనెల 17న కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. అంతేకాక సర్వేను వ్యతిరేకిస్తూ త్వరలో హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగసభ ఏర్పాటు చేయనున్నారని, మున్నూరుకాపులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పసుపులేటి దేవేందర్, మున్నూరుకాపు ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడు మేకల బిక్షయ్య, పాలేరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ మారిశెట్టి వెంకటేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానుకోట సత్యనారాయణ (మాధురి మధు) తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకుల గాంధీ

‘డబుల్’కు రోడ్డు నిర్మించేలా చూడాలి


ఆందోళన చేస్తున్న స్థానికులు

ఖమ్మం మామిళ్లగూడెం: మల్లెలమడుగు డబుల్ బెడ్రూం ఇళ్లకు రోడ్డు వేస్తుంటే 60 డివిజన్ కార్పొరేటర్, ఓ కాంగ్రెస్ పార్టీ లీడర్ రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్నారని డబుల్ బెడ్రూం నివాసులు కుటుంబాలతో కలిసి డంపింగ్‌యార్డ్ వద్ద శుక్రవారం, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యుడు, మల్లెలమడుగు డబుల్ బెడ్రూం ప్రెసిడెంట్ బోడ వీరన్న మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం రోడ్డు నిర్మిస్తుంటే వీరిద్దరు అడ్డుపడుతున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్రూం నిర్వాసితులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, సమస్యల పరిష్కారానికై యువత సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ప్రముఖ వైద్యులు చీకటి భారవి, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మంచికంటి భవన్‌లో డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన రూపొందించిన 2025 డైరీని ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తుందని దాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, జిల్లా కార్యదర్శి షేక్ బషిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


డైరీలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అటెన్షన్ ప్లీజ్

ఆనవాళ్లు.. ఆగమాగం!



నగరంలోని 59వ డివిజన్ దానవాయిగూడెంలో పట్టణ ప్రకృతి వనం ఆనవాళ్లు కోల్పోయింది. డివిజన్‌వాసులు సాయంత్రం సమయాల్లో ఆహ్లాదంగా గడిపేందుకు ఈ వనం ఏర్పాటు చేయగా.. కేవలం బోర్డు తప్ప మొక్కలు కానీ, ఆట వస్తువులు కానీ కనిపించడం లేదు. సాయంత్రం కాసేపు ప్రకృతి ఒడిలో సేదదీరేందుకు వీలులేకుండా పోయిందని, వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్